# ఆద్యంతాలు

## కొంతి కృష్ణమూర్తి

### 1

అతని పేరు సుందరమూర్తి. పేరు వినగానే మీ కళ్ళకు సుందరాతి సుందరమైన విగ్రహస్వరూపం పొడగట్టకమానదు. కాని మనిషిని చూశాక అతను సుందరుడు కాడనిపించవచ్చు.

అలాగని అతను అసహ్యంగా కనిపిస్తాడని మీరనుకున్నా, అదీ భ్రమే అవుతుంది. చామనచాయగా వున్నా కంటికి నిండుగా వుండే ఆకారం; అంత పొడుగూ, పొట్టీ, లావూ, సన్నం కాని విగ్రహం! అన్నిటికన్న అతనికి యితరుల స్నేహాన్ని క్షణంలో పొందే చాకచక్యం ఉన్నది. అందువల్లే కొన్ని క్షణాల్లోనే – ఆకారంవల్ల ఆకర్షించబడకపోయినా – చాలామంది త్వరలోనే మిత్రులు ఐపోతారు. అదే అతని ఘనత!

అతడు చాలా బీదకుటుంబంలో జన్మించాడు. స్వశక్తివల్లనే కష్టపడి చదువుకుని, అభివృద్ధిలోకి వచ్చాడు. అంటే ఉద్యోగం చేస్తూ, తల్లితమ్ముళ్లతోబాటు మరికొందర్ని ఆదుకునే సామర్థ్యం వచ్చిందన్నమాట.

అతను ఇంటర్మీడియేట్‌లో చేరిందిలగాయతు పదిహేనువం[illegible]లిస్తామనీ, రెండువేలిస్తా[illegible]నీ, నాలుగు ఎకరాల మాగాణిపొలం రాసిస్త[illegible], ఇంకా చదువుచెప్పిస్తామనీ ఎన్నో సంబంధాలు వచ్చేవి.

కాని సుందరమూర్తికిమాత్రం తనకాళ్ళమీద తను నిలబడే సామర్థ్యం వొచ్చేవరకూ పెళ్ళి చేసుకోకూడదనే గాఢవాంఛకలిగింది.

అందువల్ల అందర్నీ నిరాకరించేవాడు. అది తల్లిదండ్రుల మనస్సుకు యెంతో బాధ కలిగించింది. ఎన్నో చెప్పి అతని మనస్సుని మార్పించాలని యత్నించేవారు. కాని అతని మొండిపట్టుదలచూసి కోపగించుకునేవారు.

ఆ నాలుగెకరాల మాగాణిభూమి రాసిస్తామన్న సంబంధాన్ని అతను నిరాకరించిన రోజున వాళ్లింట్లో రెండో ప్రపంచయుద్ధమైనంత గొడవ జరిగింది.

"కలిసి వొస్తున్న సిరిని కాళ్లతో తన్నుకుంటున్నావురా. అనుకున్ననాడు ఐన సంబంధాలు రావురా" అని తల్లి వాపోయింది.

"వెధవకి తండ్రి మాటమీద ఈషన్మాత్రం గౌరవమున్నా ఏడిస్తేగా. ఒరేయ్! నామాట విను. చెడిపోతావ్. పండువంటి సంబంధాన్ని వొదులుకున్నావా, మళ్లీ నీ మొహం చూసేవాళ్లుండరు" అంటూ తండ్రి దీవెన్లను కురిపించేడు.

"నా చదువు పూర్తయి, ఉద్యోగంలో చేరేవరకూ పెళ్లాడను. నా జీవనాధారం నాకే లేనప్పుడు మరో జీవితాన్ని, కట్నానికి ఆశపడి, నాశనం చెయ్యలేను" అని కచ్చితంగా చెప్పేశాడు.

### 2

ఇప్పుడు సుందరమూర్తి తహసీల్‌లో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అతని సీటు కూడా చాలా మంచిదేనని ప్రతీతి. ఆదివారం నాడుకూడా హాజరుకావల్సిన పనే ఐనా, కొంచెం పైరాబడి ఆకష్టంవల్ల వచ్చే నష్టాన్ని పూడుస్తోందని సంతుష్టిపడేవాడు.

కష్టపడి బతికినవాడైన మూలాన అతనికి దురలవాట్లు ఏమీ లేవు. సంవత్సరానికి ఓ సినిమా కన్న ఎక్కువ చూడడు. డబ్బిచ్చి ఎప్పుడూ కాఫీ తాగడు. సిగరెట్లు, నస్యం వంటి దురలవాట్లు లేవు. ఒకళ్ళదగ్గర అప్పు తీసుకోడు; ఎవ్వరికీ అప్పివ్వడు. డబ్బు విలువ తెలిసినవాడు కాబట్టి ఒక కానీ ఐనా అనవసరంగా ఖర్చుపెట్టడు.

ఇన్ని సద్గుణాలున్నాయి కనకనే అతనో వెయ్యిరూపాయలు వెనకేశాడని అందరూ కంటతడిపెడుతుంటారు – ఇతరుల బాగును సహించలేనీ, తాము బాగుపడడం ఎరగని దౌర్భాగ్య దామోదరులు. అతన్ని లోభికింద చిత్రించి, ఉడికించ చూసేవారు.

కాని ఆపప్పులు అతనివద్ద ఉడికేవి కావు. వాటి నన్నిటినీ ఒక చిరునవ్వునవ్వి అధిగమించేవాడు. ఆఖరికి వాళ్లే ఉడుక్కుని తుర్రుమనేవారు.

అతని తండ్రి పరలోకగతుడయ్యాడు. తల్లే ఇంటికి పెద్ద దిక్కు. పెళ్లిచేసుకోమని ఒకటే పోరు పెడుతోంది. అతని పెళ్లి తమ్ముడి పోషణకు అడ్డురాదని అనేది.

కాని ఆవిడ ఇది వరకన్నమాట యదార్థమైంది. ఎప్పుడో ఎక్కడోగాని ఒక్క సంబంధమూ రావడంలేదు వొచ్చినా, ఇద్దర్లో ఎవరికో ఒకరికి నచ్చక చెడిపోతోంది.

ఇలా మూడేళ్ళుగడిచేయి. మాతృహృదయం తల్లడిల్లసాగింది. కొడుకుని ఒక ఇంటివాడివి కమ్మనమని తెగపోరసాగింది.

అతనేం చేస్తాడు – ఇస్తామని ఎవరన్నా రావాలిగా! తనంత తనే అడగలేడు కదా!


జమ్మి వారి "లివర్ క్యూర్"

బిడ్డల లివర్ & స్ప్లీన్ వ్యాధులకు

మా రోగుల సౌకర్యార్థం, మా డాక్టరును సంప్రదింపులకు ప్రతినెల నిర్ణీత తేదీలలో క్రింద పేర్కొన్న ఆయా ప్రదేశాలలో ఆయా తేదీలలో కలుసుకోవచ్చును. ప్రతిచోట సంప్రదింపుల వేళలు : ఉ॥ 9 గం॥ నుండి 11 గం॥ వరకు సా॥ 3 గం॥ నుండి 5 గం॥ వరకు మాత్రమే.

గుంటూరు 14 (ఉదయం) మెడికల్ స్టోర్సు, కొత్తపేట.
మచిలీపట్టణం 16 (ఉదయం) ఆనంద ఫార్మసీ, కెమిస్టులు, మెయిన్‌రోడ్.
ఏలూరు 18 (ఉదయం) రాధాకృష్ణ మెడికల్ స్టోర్సు.
రాజమండ్రి 19 (ఉదయం) ఈశ్వర్‌దాస్ & కో, మెయిన్‌రోడ్డు.
కాకినాడ 20 (ఉదయం) వి. ఎల్. మూర్తి & సన్, కెమిస్టులు, డ్రగ్గిస్టులు, మార్కెట్ రోడ్డు.
విశాఖపట్టణం 21 (ఉదయం) విశాఖ మెడికల్ స్టోర్సు, మెయిన్‌రోడ్డు.
భీమవరం 22 (ఉదయం) ప్రసాద్ సన్సు & కో, కెమిస్టులు, డ్రగ్గిస్టులు.

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్సు, హెడ్ఆఫీసు : మదరాసు-4.
బ్రాంచీలు : తాడంకివారి వీధి, లీలామహల్ వద్ద, గవర్నరుపేట, విజయవాడ.
ఓరుగంటివారి వీధి, విజయనగరం.

అహం అడ్డొస్తుంది. అలాంటిది మన దేశంలో కనీవిని ఎరగం.

కనుక అంతులేని నిరీక్షణ తప్ప అతనికి గత్యంతరం లేకపోయింది.

నిజానికి అతనికి ఉద్యోగంలో చేరిన మర్నాటినుండే పెళ్ళి చేసుకోవాలని అనిపించేది. ప్రేమకథల పత్రికలను తెగ చదివేవాడు మిత్రులు ప్రేమగాథలు చెబుతుంటే చెవులు పెద్దవి చేసుకుని వినేవాడు. కొలామంది సన్నిహితులైన మిత్రులవద్ద ఇంత అనేవాడు:

"మనమూ స్వీకరిస్తామోయ్ త్వరలో




# పరిశ్రమ ప్రాముఖ్యతను నిరూపించుటెట్లు?

సామాన్యమానవునకు సైకలు, కుట్టుపని మిషను, హరికేను లాంతరుతో బాటు ఉక్కు కడ్డీని చూపినట్లయిన తను మరొకసారి ఉక్కు కడ్డీవైపు తిరిగి చూడడు. అయినప్పటికి మెషీన్లకు, కట్టడాలకు, ఫ్యాక్టరీలకు...

మనము నిత్యమూ వాడుకొను చాల వస్తువులను తయారుచేయుటకు...

ఉక్కు తప్పనిసరిగా కావలెను.

భారతీయ ఉక్కు పరిశ్రమను స్థాపించి అర్ధశతాబ్దమైనా కాకపోయినా, నేడది జాతీయ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రాముఖ్యమైయున్నది. సాలీనా దాదాపు 17½ లక్షల టన్నుల వుక్కును, మరేదేశము వుత్పత్తి చేయజాలని ధరకు వుత్పత్తి చేయుచున్నది. యిందు తాతా వుత్పత్తి 10 లక్షల టన్నులకు పైగా యున్నది. ద్వితీయ పంచవర్ష ప్రణాళిక ప్రథమ దశలోనే ఉక్కు వుత్పత్తిని సాలీనా 20 లక్షల టన్నులకు పెంచుట తాతా కంపెనీ వుద్దేశము.

దేశాభ్యున్నతికి ప్రయివేటు సంస్థ అవిరామ కృషి

**ది తాతా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ లిమిటెడ్**

గృహస్థాశ్రమం. నాకు కులాలు, గోత్రాలు అంత పట్టింపు లేదులే”

అలా అంటే మిత్రులు తమ ఎరికలో వున్న సంబంధాల వాళ్ళకీ విషయం చెప్పక పోతారా ? అని అతని ధీమా !

ఎవర్నో ఒకర్ని పెళ్ళిచేసుకుని మనసు కలుపుకుని, సంసారజీవితం కొనసాగిద్దామని అనిపించే దతనికి అప్పుడప్పుడు.

అలాంటప్పుడు పెళ్ళి కాని పంతులమ్మలూ, నర్సులూ. టైపిస్టు గరల్సూ అతని మనః ఫలకంమీద మెరిసేవారు.

ఎవళ్ళన్నా తన్ను ప్రేమించకపోతారా అని పగటి కలలు కనేవాడు.

ఆ వూరికి కొత్తగా ఓ మేజిస్ట్రేట్ వొచ్చాడు. పాపం, ఆయనకు ఆడ సంతానం యెక్కువ. అర డజను పిల్లలు. అందులో మొదటి ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేశాడు—చెప్పుకో దగ్గ సంబంధాలనే. కాని మూడో అమ్మాయికి అంతకట్నం ఇవ్వలేమనే ఉద్దేశంతో కొంత తక్కువస్థాయి సంబంధమైనా ఫర్వాలేదనుకున్నాడు. అతనివద్ద బెంచిక్లర్కుగా వుంటున్న నాగభూషణంవద్ద ఆ ప్రస్తావన తెచ్చి “ఈ వూళ్ళో మంచి పెళ్ళి సంబంధాలేమన్నా వుంటే చెప్పవోయ్” అన్నాడు.

నాగభూషణం సుందరమూర్తి మిత్రకోటిలో ఒకడు. కనుక వెంటనే అతనికి జ్ఞాపకం వచ్చి, మిత్రుడి సంగతి సందర్భాలు గొప్పచేసి చెప్పాడు.

మర్నాడు మేజిస్ట్రేట్‌గారు తన బావమరిదిని పంపించి, సుందరమూర్తిని పెళ్ళిచూపుల కాహ్వానించేడు. పంచాంగాలు చూచుకుని ఆదివారంనాడు రెండు గంటలకు మంచిదిగా నిశ్చయించుకున్నారు.

అంత గొప్ప సంబంధం వచ్చినందుకు సుందరమూర్తి చాలా సంతోషించాడు; అతని తల్లి ఆనందం చెప్పతరంకాదు. ఏలాగో ఒకలాగ ఈ సంబంధం ఒప్పుకోమని తల్లి సలహా. అతనికీ మనసులో అలానే వుంది — సాధ్యమైనంతవరకూ ఇది జార విడువకూడదని.

సాయంత్రం నాగభూషణం వొచ్చి అంతా సవిస్తరంగా చెప్పేడు. మిత్రుడి సహాయానికి చాలా కృతజ్ఞత తెలిపి, హోటలుకు తీసుకువెళ్ళి, రెండణాలు ఖర్చు పెట్టి కాఫీ ఇప్పించేడు, సుందరమూర్తి. ‘అనారోగ్య’ కారణం సాకుగా తనుమాత్రం తాగలేదు. నాగభూషణాన్ని ఆదివారంనాడు తనకు తోడుగా రావల్సిందిగా పరిపరి విధాల ప్రార్థించాడు. తర్వాత పెళ్ళిచూపులు ఎలా జరుగుతాయో, ఏమేమి ప్రశ్నించాలో అంతా సవిస్తరంగా ఆలోచించుకున్నాడు.

చివరికి సుందరమూర్తి ఇలా అన్నాడు: “చూసివోయ్, నాగభూషణం. నావైపు పెళ్ళిపెద్దవు నీవే నన్నమాట. నేనేం అడిగినా బాగుండదు, చూడు. అందుకని అన్ని ప్రశ్నలూ నువ్వే అడగాలి.”

నాగభూషణం “దానికేమిటోయ్! నీ శ్రేయోభిలాషిని కాకపోతే ప్రత్యేకం మేజిస్ట్రేట్‌గారికి నీ విషయం ఎందుకు చెబుతాననుకున్నావ్? నీ పెళ్ళి చేయించే బాధ్యత నాదేననుకో. నువ్వేం భయపడకు” అని ధైర్యం చెప్పాడు—అతను ఇప్పించిన కాఫీని ఇంకా మర్చిపోలే నట్టుంది.


సుందరమూర్తి నేటికాలపు స్నేహాల మీద, అసలుండాల్సిన స్నేహధర్మాల మీదా ఒక ఉపన్యాసం ఇచ్చి మరీ వొదిలాడతన్ని.

## 4

నాలుగురోజులూ నాలుగు క్షణాల్లా గడిచేయి సుందరమూర్తికి. తల్లి తనకొడుకు పెళ్ళిచూపుల వేళకు నవమన్మథుడిలా కావాలనే కాంక్షతో బాగా పెరుగూ, నెయ్యీ, కూరలూ వేసి అతన్ని పోషించింది.

ఆదివారం వొచ్చింది; అనుకున్న








ముహూర్తం వచ్చింది. నాగభూషణం అరగంట ముందుగానే వొచ్చాడు. అప్పటికే సుందరమూర్తి రెడీగా వున్నాడు.

ఇద్దరూ రిక్షాలో వెళ్ళారు. సుందరమూర్తే రిక్షాడబ్బు లిచ్చాడు. మేజస్ట్రేట్ రావు గారు గుమ్మంవద్దనే స్వాగతమిచ్చారు. ఆయన బావమరిది తోడునీడగా వున్నట్టు తోచింది.

ఆయ నేవో ఫలహారాలు చేయించేరు. కాని వాళ్ళవేమీ ముట్టలేదు. నాగభూషణానికైతే ప్లేటులు ఖాళీచేద్దామని వుంది కాని సుందరమూర్తి ఏమీ తాకదల్చుకో లేదు కారణం వాళ్ళ అమ్మ 'ఫలహారాలు చేస్తే పొత్తు కుదరదనే మూఢనమ్మకాన్ని కలిగించడమే. అతను దాన్ని నమ్మేడని కాదు; తల్లిమాట జవదాటడనీ కాదు; కాని ఆ పరిస్థితుల్లో సంబంధం చెడిపోకుండా సాధ్యమైనన్ని అవసర చర్యలూ తీసుకోవడమే అతని ఆశయం. అందువల్లే అతను మూఢనమ్మకాలకు కూడా తాత్కాలికంగానైనా తలవొగ్గింది. అందులోనూ ఇది మంచి సంబంధం అనుకున్నారు కూడాను. ఇది చెడితే మళ్ళా ఇంత మంచి సంబంధం వస్తుందో లేదో ననే అదటొకటి. అతను చాలాసార్లు పూర్వం వొదులుకున్న ఉత్తమ సంబంధాలు గుర్తుకొచ్చినప్పుడు తను తెలివితక్కువగా ప్రవర్తించేడనే అనుమానం కూడా కలక్కపోలేదు. దానికి చింతించేవాడు కూడాను.

వాళ్లు నొచ్చుకున్నా, పెళ్ళి అయ్యే వరకూ పెళ్ళివారికి సానుకూలంగా నడుచుకోవాలి కనుక పైకేమీ అనలేదు. పదిహేను నిమిషాలు మేజస్ట్రేట్ గారు అమ్మాయి అందచందాలని వర్ణించేడు. తర్వాత ఆయన బావమరది తన బావ ఘనతనూ, ఉన్నతోద్యోగుల పిల్లల్ని చేసుకోవడంవల్ల కలిగే లాభాలనూ, పొందజాలిన ఉన్నత స్థితిని గురించి చిన్న లెక్చర్ రూపంలో సెలవిచ్చేడు.

సుందరమూర్తి, నాగభూషణం నవ్వు ముఖాలతో "అవునండి", "అంతేనండి", "బాగా చెప్పారు", "నిజమే" అంటూ కాలక్షేపం చేశారు. అరగంట గడిచింది. అమ్మాయిమాత్రం ఇంకా రంగస్థలం మీదికి తేలేదు.

సుందరమూర్తి మెదడులో ఆలోచనా తరంగాలు: మేజస్ట్రేట్ గారు అంత అందగాడు కాదు; కూతురెలా వుంటుందో? తల్లి పోలికట. తల్లి అప్సరసలా వుంటుందని ఆయన పరోక్షంగా వ్యక్తపర్చారు, భార్య గొప్పతనాన్ని గురించి. కాని బావమరదిని చూస్తుంటే ఆవిడా అలాగే వుంటుందేమో ననిపించసాగింది.

"అమ్మాయిని రమ్మనవోయ్" అన్నాడు మేజస్ట్రేట్ గారు బావమరదితో, కొంత ఆజ్ఞాపూర్వకస్వరంతో.

ఆయన మధ్య హాలువద్దకు వెళ్లి "అమ్మాయిని పంపవే, అక్కయ్యా" అన్నాడు.

మరుక్షణంలో పెళ్ళికూతురు అడుగులో అడుగేసుకుంటూ. చిత్తరమాపులతో నేలమీద పర్చిన తివాసీని చూస్తూ ప్రవేశించింది. కూడా తల్లి గారు అనుసరించింది. కూతుర్ని సోఫామీద కూచోబెట్టి కాబోయే అల్లుడిని ఓసారి పరికించింది.

మేజస్ట్రేట్ గారు అతన్ని చూపి "ఇతనే సుందరమూర్తి. బి. ఎ. ఉపాధ్యాయుడు" అంటూ ఆవిడకు పరిచయం చేశాడు

సుందరమూర్తి "నమస్కారమండి" అన్నాడు.

"అలా కూచో మనవాడేలే" అన్నాడు బావమరది. ఆవిడ కూతురికి పక్కగా వున్న సోఫామీద కూచుంది

సుందరమూర్తి తల్లీ కూతుళ్ళను పరిశీలనగా చూడసాగేడు. ఆ అమ్మాయి నిజంగా తల్లి పోలికే. తల్లి అందంగానే ఉంది. కాని

---

ఎల్బి గ్రాంథారం తీసుకుని, కలం ఎరువడిగి, దానిమీద సంగతి వ్రాసి, జేబులోనుంచి పర్సు, పర్సులోంచి డబ్బా తీసి, స్టాంపుకొన్న ఒక ఆసామీకి తను అప్పటికే చాలా కష్టపడ్డట్టు అనుమానం వేసింది. పోస్టువాళ్లు చెయ్యవలసినంత సేవ చెయ్యటం లేదని ఊహ వచ్చింది.

స్టాంపు తడిచేస్తూ, ఆఖరికి స్టాంపూ నేనే అంటించుకోవాలా అన్నాడు కొంత ఈసడింపుగా.

"మీ వద్దు ఎల్బి గ్రాంథారానికి అంటించండి." అని సలహా యిచ్చాడు గుమాస్తా.

**వైద్యుడు:** నేనిచ్చిన మందు ఎలా పనిచేసిందండి?

**రోగి:** భేషుగ్గానండి. మీరిచ్చిన పొడుంతో నా జ్వరం, మా అత్తగారి కీళ్ల నొప్పులు, అమ్మాయి జలుబు నయమైపోయాయి. మిగతా పొడుం పెట్టి, ఇవాళ మాఆవిడ కాఫీగిన్నెలు తోముతోందండి.

జుట్టు పాపిడిదగ్గర తెల్లబడింది. జడ సన్నగా అయిపోవడంవల్ల బర్నాసుడి వేసుకుంది. మొహం పాలిపోయి తెల్లగావుంది. కళ్ళు పెద్దవైనా లోతుకుపోయి, లోతైన నూతుల్ని గుర్తుకు తెస్తున్నాయి ఐనా పూర్వపు సౌందర్యచ్ఛాయలు స్పష్టంగా కనబడుతూనే ఉన్నాయి.

ఆ అమ్మాయి చాలా అందంగా ఉందనిపించిందతనికి. జీవిత ప్రాంగణంలో అడుగు పెట్టబోతున్న కన్యారత్నం కట్టుకున్న గులాబీరంగు చీర, పూసుకున్న సెంటు వాసనలు అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి.

“అమ్మాయి నీ పేరేమిటమ్మా” అన్నాడు నాగభూషణం.

ఒకసారి లేడి చూపులతో వారిని చూసి, “విశాల” అంది సుందరమూర్తి సంతృప్తికరంగా చిరునవ్వు నవ్వేడు - పేరు బాగానే ఉందన్నట్టు.

“ఏం చదువుకుందో అడుగు” అన్నాడు నాగభూషణంతో.

“హెచ్. యస్. సి. చదువుతోం”ది అన్నాడు బావమరది.

“ఆ అమ్మాయినే చెప్పనీండి” అని నాగభూషణం అడ్డొచ్చేడు.

“చెప్పవే” మేజస్ట్రేట్ అన్నాడు.

“పదో క్లాసు” తీయని గొంతుకతోనే అంది.

“ఏమన్నా పాటలు వచ్చేమో?” అని కొసిరాడు, సుందరమూర్తి.

“సంగీతం ప్రత్యేకం నేర్పించలేదుగాని, ఏవో గాలిపాటలు కొన్నివచ్చు” తల్లి అందుకుని బదులు పలికింది.

“ఒక పాటపాడమ్మా” అన్నాడు నాగభూషణం, పెళ్లి పెద్దలా మొహం పెట్టి, మేజస్ట్రేట్ గారికేసి చూస్తో. కాసేపు బెంచి క్లర్కునని మర్చిపోవడానికి యత్నిస్తున్నాడు. ఆయన నవ్వు మొహం అతనికి మరికొంత ధైర్యాన్నిచ్చింది.

ఆఅమ్మాయి “రామ నీసమాన మెవరురా?” అని అందుకుని మధురంగా పాడింది.

అది పెళ్ళివారికి సంతృప్తిని కలిగించింది.

కాసేపయ్యాక నాగభూషణమే “ఇంక అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళండమ్మా” అన్నాడు.

ఆవిడ కూతురుతోబాటు నిష్క్రమించడానికి లేచింది. వెళ్లేముందు ఓసారి ధైర్యం చేసి, విశాలమైన నేత్రాలతో కాబోయే భర్తని వీక్షించింది, విశాల

“రెండురోజుల్లో ఏ విషయమూ తెలీజేస్తా” నని అన్నాడు సుందరమూర్తి.

“తొంభైపాళ్లు కుదిరినట్టే. మావాణ్ణి వొప్పించేభారం నాది” అన్నాడు నాగభూషణం సెలవుతీసుకుంటూ.

## 5

రెండురోజులు సెలవుపెట్టి తీవ్రంగా తన భవిష్యత్ గురించి ఆలోచించుకోసాగేడు సుందరమూర్తి.

తల్లి ఆత్రుత మరీ అధికమైంది. ఆ సంబంధము తప్పక వొప్పుకోమనీ, మరో తప్పటడుగు వేయవద్దనీ, అదేపనిగా వికరువు పెట్టసాగింది.

అతనికీ అంత అభ్యంతరమేమీ వున్నట్టనిపించలేదు.

‘అమ్మాయి బాగానే వుంది. గౌరవ ప్రతిపత్తులుగల కుటుంబం. మూడు వేలకు పైగా కట్నమీయక మానరు. మామగారి హోదా, పలుకుబడీ అతని కెప్పటికన్నా తోడ్పడక మానవు.’

ఏ విధంగా చూసినా సంబంధం మంచిదనే తోస్తోంది.

కాని ఒక్కటే అతని మెదడులో చీడపురుగులా బాధించసాగింది. అదేమిటంటే ఆ అమ్మాయి తల్లిపోలిక నుండడమే.

మరో పదిహేనేళ్లు పోతే తన కాబోయే భార్య ఆమె తల్లి మోస్తరుగా మారుతుందన్నమాట! అంటే ఆ పాపిడి చుట్టూ తెల్లని జుట్టూ, ఆ పాలిపోయిన మొహం, లోతుగా ఉన్న కళ్ళూ, పిలకలాంటి జడా—అచ్చం ఆ తల్లి ఆకృతినే పొందుతుంది. అందులో సందేహం లేదు.

ఈ వూహ మనసుకి తోచేటప్పటికి అతనికి వివాహంమీదే విరక్తి కలగసాగింది. ఏవో నిగూఢ జీవితసత్యం కళ్లముందు ప్రత్యక్షమైనట్లనిపించింది.

‘జీవితం ఇంతే! ఈనాడు అందంగా విప్పారిన గులాబీ, మర్నాడు రేకలు రాలి నేలపాలవుతుంది. అలాంటి క్షణిక సుఖానికి ఎగబడి, నిరాశపాలవడం దేనికి? చూస్తూ అగ్నిలో వేలు పెట్టడం ఎందుకు? అనుకున్నాడు, పెళ్లి చేసుకోవాలనే నిశ్చయాన్ని విరమించుకుంటూ.

**న్యాయవాది:** (క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తిచేశాక) పాపం, నా ప్రశ్నలవర్షం మిమ్మల్ని చికాకు పరిచి వుంటుంది.

**సాక్ష్యానికి వచ్చిన స్త్రీ:** అబ్బే లేదండి. మా అబ్బాయికి అడ్డమైన ప్రశ్నలన్నీ అడగడం సరదా. నాకు అలవాటే లెండి.

## 6

మర్నాడు నాగభూషణం మేజస్ట్రేట్ గారింటికి వెళ్లి, “అతను తమ్ముడి చదువు పూర్తయ్యేవరకు పెళ్లి చేసుకోడట” అని చెప్పారు.

పెళ్లిసంబంధాలను వెతకలేక వేసారిపోతున్న మేజస్ట్రేట్ గారు “అదీ మన దురదృష్టమే” అన్నాడు. బావమరిది భావాలు మనసులోనే ఆగిపోయాయి. ★

